
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

మంగళవారం 26 మార్చి 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం సా : 6.34 గం.

సహర్ : బుధవారం ఉ : 4.53 గం.

కలర్‌ఫుల్

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- రంగుల్లో మునిగి తేలిన చిన్నాపెద్ద
- ఉత్సాహంగా పాల్గొన్న జిల్లా ఎస్పీ రూపేష్
- రంగులు చల్లుకుని చిందేసిన మున్సిపల్ చైర్‌పర్సన్లు

సంగారెడ్డి క్రైం, మార్చి 25 : సంగారెడ్డి జిల్లాలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పిల్లలు, పెద్దలు ఉదయం నుంచి రంగులు చల్లుకుంటూ సంతోషంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హోలీ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందితో కలిసి రంగులు చల్లుకుని, ఉట్టి కొట్టారు. హోలీ అందరి కుటుంబాల్లో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. వేడుకల్లో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పట్టణ సీఐ ఎస్.భాస్కర్, ఆర్ఐ రాజేశేఖర్‌రెడ్డి, ఎస్బీ ఎస్ఐ యాదవరెడ్డి, ఆర్ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హోలీ పండగ సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరుగకుండా పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. అలాగే, సంగారెడ్డి పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి కాలనీవాసులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండగను జరుపుకున్నారు.



సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఉట్టి కొడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్



నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో హోలీ సంబురాలు





చిందేస్తున్న మెదక్ సన్‌రైజ్ వాకర్స్, సంగారెడ్డిలో రంగులు చల్లుకుని స్టెప్పేస్తున్న చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి

కంగ్టి మండలం భీంరాలో గిరిజన మహిళల సంబురాలు ▼





సంగారెడ్డి పట్టణంలో రంగులు చల్లుకొని కేరింతలు కొడుతున్న చిన్నారులు

ఎన్నికలయ్యే దాకా

బిల్లుల్లేవ్..!

- స్పష్టం చేస్తున్న అధికారులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 25: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బిల్లులు చెల్లించడం కుదరదని అధికారులు స్పష్టం చేస్తుండటంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. లక్షల రూపాయలు అప్పులు చేసి ప్రభుత్వ పనులు చేపట్టిన తాము సుదీర్ఘమైన ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు వేచిచూస్తే బజారున పడక తప్పదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

రూ. లక్షల విలువైన పనులు

సంగారెడ్డి జిల్లాలోని పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ తదితర ఇంజనీరింగ్ శాఖల ఉత్తర్వులతో ప్రభుత్వ శాఖలకు సంబంధించి వివిధ నిర్మాణాలను కాంట్రాక్టర్లు చేపట్టారు. ఆయా నిర్మాణాలను పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు పనుల పురోగతి ఆధారంగా బిల్లుల చెల్లింపులు చేస్తారు. అయితే, ఈ నెల 16న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. ఆ రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ 6వ తేదీ వరకు కోడ్ అమలులో వుంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈమేరకు షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచి తాము ఎన్నికల విధుల్లో నిమగ్నమవుతామని, అందుకే అభివృద్ధి, నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించబోమని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రజావాణిని రద్దు చేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. బిల్లుల మంజూరుకు సంబంధించిన ఫైళ్లను, చెక్కులను తమ వద్దకు పంపించవద్దని ఉన్నతాధికారులు వివిధ శాఖల ఇంజనీరింగ్ ఏజెన్సీలను ఆదేశించినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు తేల్చి చెబుతున్నారు.

వచ్చే నెలలో బిడ్డ పెళ్లి

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆదేశాలతో పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ పరిస్థితి ఇప్పుడు అయోమయంగా తయారైంది. లక్షల బిల్లులు వస్తాయనే నమ్మకంతో సంగారెడ్డికి చెందిన ఓ కాంట్రాక్టర్ తమ కూతురు పెళ్లి వచ్చే నెలలో జరిపేందుకు నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంతలోనే రెండు నెలల పాటు బిల్లులు ఇవ్వబోమని అధికారులు పేర్కొనడంతో ఏంచేయాలో తోచడం లేదని సదరు కాంట్రాక్టర్ ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసే దాకా రెండు నెలల పాటు బిల్లులు ఇవ్వకపోతే ఎలా అని పలువురు కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

గరం..గరం

గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ సెగలు

- వంటేరు, తూంకుంట మధ్య మాటల యుద్ధం
- అనుచర వర్గాల విమర్శలతో మరింత హీట్
- వంటేరు ప్రతాప్‌రెడ్డి దారెటు?

గజ్వేల్, మార్చి 25: మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ వేడి సెగ పుట్టిస్తుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న దశాబ్దకాలంగా స్తబ్దుగా ఉన్న నేతలు, బీఆర్ఎస్ పీఠం కదలడంతో చోటుచేసుకున్న పరిణామాలతో వేగంగా మార్పులు వచ్చాయి. తమ ఉనికి కోసం నేతలు, వారి అనుచరగణం మధ్య ఆధిపత్య పోరుకు తెరలేచింది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి నువ్వా నేనా అన్నట్లు రాజకీయ క్షేత్రంలో కత్తులు దూసుకుంటుండంతో గజ్వేల్ రాజకీయ ముఖచిత్రం గతాన్ని తలపించేలా ఆసక్తికరంగా మారింది.

గతంలోనూ..

2009 వరకు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉండడంతో అంతా స్థానిక నేతలే రాజ్యమేలారు. 2009లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అనంతరం గజ్వేల్ జనరల్ స్థానంగా మారిపోయింది. అప్పటివరకు డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న తూంకుంట నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి టీడీపీ నుంచి బరిలో దిగగా, అప్పటికి డీసీసీబీ మాజీ చైర్మన్‌గా ఉన్న ఎలక్షన్‌రెడ్డి ప్రజారాజ్యం పార్టీ నుంచి బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి.. వంటేరు ప్రతాప్‌రెడ్డిపై 7,500పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. ఈ క్రమంలోనే అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న నర్సారెడ్డి, ప్రతిపక్ష నేత ప్రతాప్‌రెడ్డి మధ్య భీకర వాతావరణం ఏర్పడింది. ఏదో ఒక అంశంలో ఇద్దరు నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ తమ ఆధిపత్యాన్ని చాటేవారు. 2013లో జరిగిన కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో ఇరువర్గాల వారు దాడులకు సైతం దిగారు. రాళ్లతో, కట్టెలతో దాడులకు దిగి భయంకర వాతావరణాన్ని ఏర్పర్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన రావడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్ నుంచి బరిలో దిగారు. దీంతో ఆయనపై పోటీ చేసిన ప్రతాప్‌రెడ్డి, నర్సారెడ్డి ఓటమి పాలయ్యారు.

పార్టీలు మారిన నాయకులు

2014 ఎన్నికల అనంతరం తూంకుంట నర్సారెడ్డి సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను చేపట్టారు. తదనంతర పరిణామాలతో నర్సారెడ్డి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. అయితే, టీడీపీ పూర్తిగా బలహీనపడడంతో ప్రతాప్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ప్రత్యర్థిగా ప్రతాప్‌రెడ్డి పోటీపడగా నర్సారెడ్డి ఆయనతో కలిసివచ్చారు. ఈ ఎన్నికల్లో ప్రతాప్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. 2019 జనవరిలో ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో రాజకీయాల్లో ఒక్కసారిగా నిశబ్ధ వాతావరణం ఏర్పడింది. అనంతరం కరోనా, ఇతర పరిస్థితుల నుంచి తేరుకున్నాక ప్రతాప్‌రెడ్డి ఎఫ్‌డీసీ చైర్మన్‌గా రెండు పర్యాయాలు పనిచేశారు. 2023లోనూ కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటీచేయడంతో ఆయనను గెలిపించేందుకు ప్రతాప్‌రెడ్డి కృషిచేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నర్సారెడ్డి బరిలో దిగి ఓటమి పాలయ్యారు.

హీటెక్కిన రాజకీయం

గజ్వేల్ నియోజకవర్గం అంటేనే ఒకరికిమించి ఒకరు ఎత్తులు వేస్తూ రాజకీయాలకు అడ్డాగా ఉమ్మడి మెదక్ జిల్లాలో పేరు గాంచింది. 2014లో కేసీఆర్ గజ్వేల్ నుంచి బరిలో నిలవడంతో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. ఏకపక్ష రాజకీయాలకు తెరలేచింది. అయితే, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ విజయం సాధించినప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. చట్టసభకు వెళ్లాలని ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి ఎంపీగా పోటీ చేసేందుకు యత్నించారు. కానీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీ ఐఏఎస్, ప్రస్తుత ఎమ్మెల్సీ పారుపాటి వెంకట్రామారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతో వంటేరుకు నిరాశే మిగిలింది. ఈ విషయంలో కినుక వహించిన ప్రతాప్‌రెడ్డిలో అసంతృప్తి జ్వాల మొదలైంది. కానీ, ఎక్కడా తాను పార్టీ మారబోతున్నట్లుగా తన నిర్ణయాన్ని బహిర్గతం చేయడం లేదు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో ప్రతాప్‌రెడ్డి చేరబోతున్నారంటూ పెద్దఎత్తున ప్రచారం జరగడంతో ఇది నచ్చని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ వ్యతిరేకించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్సారెడ్డితో పాటు తనకు ఎంపీ టికెట్ రాకుండా అడ్డుకుంటున్నారని భావించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులపై విరుచుకుపడ్డారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి ప్రతాప్‌రెడ్డిపై మండిపడ్డారు. దీంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో గజ్వేల్ హాట్‌టాపిక్‌గా మారిపోయింది.

ఇరు పార్టీల కార్యకర్తల్లో ఆందోళన


గజ్వేల్ రాజకీయాల్లో వేడి రగలడంతో అటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఇటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొన్నది. బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న తమ నాయకుడికి టికెట్ ఇవ్వకుండా చేశారని ప్రతాప్‌రెడ్డి అనుచరులు అగ్గిమీద గుగ్గిలం అవుతుండగా, తాము అధికారంలోకి వచ్చి పదవులపై ఆశలు పెంచుకుంటే ప్రతాప్‌రెడ్డి రూపంలో గండిపడేలా ఉందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్‌లో గ్రూపులతో పోరాడిన తాము, కాంగ్రెస్ పార్టీలోకి వెళితే అక్కడ మరోసారి వర్గపోరుతో సతమతమవుతామని వంటేరు అనుచరులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే వంటేరు తన మనసులోని మాటను పూర్తిస్థాయిలో ఎక్కడా బహిర్గతం చేయకపోవడంతో ఆయన అనుచరులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అయోమయం నెలకొన్నది. కాంగ్రెస్‌లోకి రాకుండా తూంకుంట నర్సారెడ్డి అడ్డంకిగా ఉండడంతో వంటేరు ఏదారిని ఎంచుకుంటారో సందిగ్ధం నెలకొన్నది.



వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్ నియోజకవర్గ మ్యాప్



తూంకుంట నర్సారెడ్డి

ఆన్‌లైన్‌లో 'ఆయుష్' సేవలు

- హాజరు, ఓపీ, మందుల స్టాక్ నుంచి సెలవుల వరకు
- వివరాలు నమోదుకు ప్రత్యేక యాప్
- ప్రతీ డిస్పెన్సరీకి ట్యాబ్‌ల అందజేత
- పారదర్శకత దిశగా చర్యలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 25 : తెలంగాణ ఆయుష్‌శాఖ పారదర్శకత దిశగా చర్యలు చేపట్టింది. వైద్య ఆరోగ్యంలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఆధునిక వైద్యానికి లొంగని కొన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధుల్ని సైతం నయం చేసే గుణం ఆయుర్వేద వైద్యానికి ఉందంటారు. పురాతన ఆయుర్వేద వైద్యాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద, హోమియో, యునాని, నేచరోపతి వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఇప్పటివరకు ఆయూష్ విభాగంలోని అన్ని సేవలను ఆఫ్‌లైన్‌లో కొనసాగించగా, తాజాగా ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు ఆ శాఖ తగిన చర్యలు తీసుకున్నది.

పక్కాగా వివరాల నమోదు

ఆయుష్ విభాగంలో డాక్టర్, సిబ్బందితో పాటు రోగి, మందులు ఇతరత్ర వివరాలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో నమోదుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఆయుర్వేద, హోమియో, యునాని, నేచరోపతి డిస్పెన్సరీలకు విడివిడిగా ట్యాబ్‌లు అందజేసింది. ట్యాబ్‌లో ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా డిస్పెన్సరీకి సంబంధించిన అన్ని వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే నమోదుతో పాటు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ ఓపీ రిజిస్ట్రేషన్, డైలీ ఓపీ రిపోర్టు, హెల్త్ క్యాంపుల నిర్వహణ షెడ్యూల్, సెలవులు, అనుమతులు, ఫార్మసీ స్టాక్, ఇండెంట్, ఇన్‌వార్డ్, ఔట్‌వర్డ్ రిజిస్టర్స్ తదితర వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

పారదర్శకత దిశగా అడుగులు

ఆయుష్‌శాఖలోని ఆయుర్వేద, హోమియో, యునాని, నేచురోపతి వైద్య సేవలందించే కేంద్రాలను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చారు. ఆయా కేంద్రాల్లో డాక్టర్లు, సిబ్బంది విధుల హాజరు విషయంలో తరచూ విమర్శలున్నాయి. ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో తెలియని పరిస్థితి నెలకొన్నదని రోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు డిస్పెన్సరీల్లో ఇదే పరిస్థితి నెలకొనడం ఆందోళన వ్యక్తమవుతున్నది. సిబ్బంది విధుల నిర్వహణే కాకుండా అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించరనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ఆయుష్ శాఖ ప్రత్యేకంగా ట్యాబ్‌లు అందజేసి, ఇక నుంచి అన్ని వివరాలు ట్యాబ్‌లో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది. డాక్టర్లు, సిబ్బంది ఉదయం 10 గంటల వచ్చి, సాయంత్రం 4 గంటలకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా రెండుసార్లు ట్యాబ్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ట్యాబ్‌లు వెంట తీసుకెళ్లి హాజరులో అవకతవకలు పాల్పడకుండా డిస్పెన్సరీలోనే ట్యాబ్‌లు ఉంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆయా డిస్పెన్సరీల మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ సమయంలో ఆదేశాలు జారీ చేశారు.



సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్

తూప్రాన్, జిన్నారంలో కోర్టులు

- మంజూరు చేసిన ప్రభుత్వం

తూప్రాన్/జిన్నారం, మార్చి 25: మెదక్ జిల్లా తూప్రాన్, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తూప్రాన్‌లో జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మంజూరు చేస్తూ లీగల్ అఫైర్స్, లెజిస్లేటివ్ అఫైర్ అండ్ జస్టిస్ ప్రభుత్వ కార్యదర్శి ఆర్.తిరుపతి ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అప్పట్లో భవనాలను సైతం అధికారులు పరిశీలించారు. ఆ తరువాత వాయిదా పడినా ప్రస్తుతం ప్రభుత్వం కోర్టు ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంది. అలాగే, మండల కేంద్రమైన జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. జిన్నారంలో సోమవారం ఆయన మట్లాడుతూ జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం ఈ నెల 13న రాష్ట్ర ప్రభుత్వం జీవోఎంఎస్ 13 విడుదల చేసినట్లు ఎంపీపీ తెలిపారు. త్వరలోనే న్యాయశాఖ అధికారులు స్థానికంగా ఉన్న పలు ప్రభుత్వ భవనాల పరిశీలన జరుపుతారని ఆయన తెలిపారు.



తూప్రాన్‌లో కోర్టు ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రియల్.. ఢమాల్

- ఎన్నికల కోడ్ అమలుతో నిలిచిన భూమ్
- అయినా, తగ్గని భూముల ధరలు

మందగించిన స్థిరాస్థి వ్యాపారం

7లో

దైనందిన జీవనంలో ధర్మాన్ని ఆచరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కృష్ణానందస్వామి

రామాయంపేట, మార్చి 25: ప్రతీ మనిషి దైనందిన జీవనంలో ధర్మాన్ని మరువరాదని టేక్రియాల్ కృష్ణానంద ఆశ్రమ రామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి బోధించారు. సోమవారం రామాయంపేట గీతా సేవాసమితి మూడు దశాబ్దాల వార్షికోత్సవానికి ఆయనతో పాటు శతావధాని ప్రభాకరశర్మలు చేరుకుని యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి, జ్ఞానం ఆచరిస్తేనే మానవుని జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. భగవద్గీత పారాయణం వల్ల నిత్య శాంతి, ఉత్సాహం పెరిగి అఖండ విజయం సిద్ధిస్తుందని వివరించారు.సంస్థ నిర్వాహకులు బల్ల రాజయ్య, దినేష్ అంజయ్య, చంద్రమౌళి, పెంటయ్య, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్ పాల్గొన్నారు.

కనుల పండువగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

కొల్చారం, మార్చి 25: కొల్చారం మండల పరిధిలోని పైతరలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. అర్చకులు నాగరాజు పంతులు, కృష్ణత్రిపాఠిలతో పాటు ఇతర పురోహితుల వేదమంత్రోశ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మందిరం నుంచి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన ఎల్లుగారి రామక్రిష్ణారెడ్డి, శ్రీమతమ్మ కుటుంబ సభ్యులు, ఇస్నాపూర్ ప్రాంతానికి చెందిన ప్రసన్న, రాజిరెడ్డి దంపతులు కళ్యాణోత్సవానికి సంబంధించిన పట్టువస్త్రాలను, పుస్తెమట్టెలను స్వామివారికి అందజేశారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి హాజరై భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు బీఆర్ఎస్ నాయకుడు ఎల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి సొంత ఖర్చులతో అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

ఘనంగా సంగమేశ్వర జాతర

కౌడిపల్లి, మార్చి 25: మండల పరిధిలోని కొట్టాలలోని సంగమేశ్వర ఆలయం వద్ద జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేశంగౌడ్, నాయకులు గౌరెడ్డి పాల్గొన్నారు.

రియల్.. కుదేల్

- మందగించిన స్థిరాస్తి వ్యాపారం
- ఎన్నికల కోడ్ అమలుతో నిలిచిన భూమ్
- అయినా, తగ్గని భూముల ధరలు



మెదక్ పట్టణంలోని పిల్లికోటాన్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన లే అవుట్

మెదక్, మార్చి 25: మొన్నటివరకూ జోరుగా సాగిన రియల్ వ్యాపారం ఆరునెలలుగా మందగించింది. ధరలు నింగికి ఎగసినా.. వ్యాపారం మాత్రం సాగడం లేదు. పదేళ్ల క్రితం గుంట రూ.20 నుంచి 50 వేలు ఉండగా, ప్రస్తుతం గుంట స్థలానికి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకూ ధర పలుకుతోంది. పట్టణాలకు కాస్త దగ్గరగా ఉన్న, రహదారులకు పక్కన గల భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. వాస్తవానికి కొన్నినెలలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గుముఖం పట్టింది. దీంతో భూముల ధరలు తగ్గుతాయని అందరూ భావించారు. కానీ, అందుకు భిన్నంగా ధరలు మాత్రం ఆకాశంలోనే ఉన్నాయి. గతంలో నిత్యం వ్యాపారులతో కిటకిటలాడే రిజిస్ట్రేషన్, తహసీల్ కార్యాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

అప్పులు చేసి కొనుగోళ్లు

రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడిన వారు అప్పులుచేసి భూములు కొనుగోలు చేశారు. ఆరునెలలుగా వ్యాపారం స్తంభించిపోయింది. ఎంతో ఖర్చుచేసి లేఅవుట్లు వేసినా.. ప్లాట్లు అమ్ముడుపోవడం లేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారులు దిక్కుతోచకున్నారు. ప్రభుత్వమే భూముల విలువను పెంచేయడం, అందుకు అనుగుణంగా స్థలాల రేట్లు నిర్ధారించాల్సి రావడంతో లేఅవుట్ స్థలాలు అమ్ముడుపోవడం లేదని వాపోతున్నారు. దాంతో మెదక్ లాంటి వెనకబడిన జిల్లాలో స్థలాల క్రయవిక్రయాలు దారుణంగా పడిపోయాయి. మెదక్ పట్టణంలో 25 వరకూ వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయానికి పెట్టగా రెండేళ్ల వ్యవధిలో 30 శాతం ప్లాట్లు అమ్మలేకపోయామని రియల్టర్లు చెబుతున్నారు. మరికొందరు సదరు భూమిని యజమాని వద్ద అగ్రిమెంట్ చేసుకుని వాయిదా వ్యవధిలోగా డబ్బు ముట్టజెప్పలేక నష్టపోయిన సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. మరోపక్క మెదక్-చేగుంట ప్రధాన రోడ్డులో గజానికే కనీసం రూ.30 వేలు వెచ్చించాల్సి వస్తోంది.

ఎన్నికల కోడ్‌తో..

గత సంవత్సరం చివరల్లో అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులోకి రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పడిపోయింది. పర్యవసానంగా భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు ఎక్కడిక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తున్నారు. జిల్లా సరిహద్దులలో నగదు, మద్యం తరలింపును అడ్డుకుంటున్నారు. ఆరునెలలుగా కొద్దిపాటి విరామం మినహా ఇదే పరిస్థితి కొనసాగడంతో రూ.50వేలకు మించి నగదు తరలించే అవకాశమే లేకుండాపోయింది. దాంతో భూముల క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. మెదక్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో గత నవంబర్ కంటే ముందు రోజూ 25 నంచి 30 వరకు డ్యాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవని, నవంబరులో ఎన్నికల కోడ్ అమలులోకి వచినప్పటి నుంచి రోజుకు కనీసం 10డ్యాక్యుమెంట్లకు మించి రిజిస్ట్రేషన్లు కావడంలేదని, శాసనసభ ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడినా పరిస్థితిలో మార్పు లేదని సబ్ రిజిస్ట్రార్ రఘుపతి తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు డబ్బు చెల్లింపులకు ఇబ్బంది ఏర్పడుతోందని వ్యాపారులు చెబుతున్నారు. కేవలం మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగుతున్నాయని అంటున్నారు.

నిలిచి పోయిన లాండ్ పూలింగ్ లేఅవుట్

మెదక్ పట్టణంలో లాండ్ పూలింగ్ కింద గత ప్రభుత్వ హయాంలో పట్టణ శివారు పిల్లి కోటాల్‌లో సర్వే నంబర్ 870/పీ, 890/పీ, పరిధిలోని 24 ఎకరాల 30 గుంటల భూమిని సేకరించారు. ఈ లేఅవుట్ అభివృద్ధి చేసేందుకు అప్పటి కలెక్టర్ రాజర్షిరారూ. 6 కోట్లు మంజూరు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో 2023 ఆగస్టులో టెండర్లు పిలవగా, హైదరాబాద్‌కు చెందిన సాయితేజా కన్‌స్ట్రక్షన్స్ బిడ్ దక్కించుకుని పనులు ప్రారంభించింది. 80 ఫీట్ల రోడ్లు, 40 ఫీట్ల ఇంటర్నల్ రోడ్లు, 30 ఫీట్ల రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వెంచర్ ముఖద్వారంలో ఓ ఆర్చరీ, విద్యుదీకరణ, మంచి నీటి సౌకర్యం వంటి పనులు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ భూమి చదును చేసి ఎర్త్ వర్క్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ల పనులు పూర్తి చేశారు. సుమారు కోటీ 80 లక్షల విలువైన పనులు పూర్తి చేయగా, ఇప్పటి వకు కేవలం రూ. 10 లక్షల బిల్లు మాత్రమే వచ్చిందని కాంట్రాక్టర్ చెబుతున్నారు. అయితే, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ లే అవుట్‌ను పట్టించుకునే వారు లేక నిలిచిపోయింది.

పంట కాపలాకు వెళ్లిన రైతు దారుణ హత్య

- గొడ్డలితో నరికి చంపిన దుండగులు
- పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



భూమయ్య(ఫైల్)

కౌడిపల్లి, మార్చి 25: వ్యవసాయ పంట పొలానికి కాపలాగా వెళ్లిన రైతును గుర్తు తెలియని దుండగులు గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. కౌడిపల్లి గ్రామానికి చెందిన రాజం భూమయ్య(65) తన పంట పొలాన్ని అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు ప్రతిరోజూ కాపలాకు వెళ్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం కూడా పొలానికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్‌చేయగా స్పందన లేదు. దీంతో గ్రామానికి చెందిన రంగయ్య పొలం వద్దకెళ్లి చూడగా రక్తపు మడుగులో ఉన్న భూమయ్యను చూసి వెంటనే కుటుంబసభ్యులకు తెలియజేశాడు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వీపుపై బలమైన గాయాలు ఉన్నాయని, మరోచోట హత్యచేసి పంట పొలంలోని మంచంపై పడుకోబెట్టారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆధారాలను సేకరించేందుకు క్లూస్‌టీంను రప్పించారు. పోలీస్ జాగిలం మృతదేహం నుంచి కౌడిపల్లి గ్రామ సమీపం వరకు వచ్చి అక్కడే ఆగిపోయింది. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇదిలా ఉండగా హత్యలో ప్రమేయం ఉన్నదనే అనుమానంతో మృతుడి కుటుంబంలోని ఒక మహిళతో పాటు అదే గ్రామానికి చెందిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు పురోగతి సాధించేందుకు గాను ఫోన్ కాల్ డేటాను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

సిద్దిపేట, మార్చి 25: పేదరికం మూలంగా స్వయం ఉపాధికి ఇంట్లోంచి ప్రోత్సాహం లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేర్యాల పట్టణానికి చెందిన బుట్టి నర్సింహులు రెండో కుమారుడు బుట్టి నవీన్(26) డ్రైవర్. సొంతంగా కారు కొనుక్కుంటే తన కాళ్లమీద స్వతహాగా బతకొచ్చని తల్లిదండ్రులతో చెబుతూ ఉండేవాడు. కొద్దిరోజులు పనికి వెళ్లి కొంత నగదు జమచేసుకున్న తర్వాత ఫైనాన్స్‌లో కారు కొందామని తల్లిదండ్రులు చెప్పారు. అయితే కారు కావాలని గొడవచేసి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటుండగా వారు మందలించారు. ఈ నెల 24ననర్సింహులు చిన్నాన్న కుమారుడి పెళ్లి చూపులకు వెళ్లి వచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోంచి వెళ్లిన నవీన్ తిరిగి రాలేదు. ఉదయం ఇంటి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి బుట్టి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడు.. కారు ఢీకొని వ్యక్తి మృతి

జిన్నారం, మార్చి 25: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందగా.. కారు ఢీకొని మరొకరు మృతిచెందారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన కార్తీక్‌చారి(14) ఆదివారం నల్లవల్లి నల్ల చెరువులో తన స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. స్నేహితులందరూ చెరువులోకి దిగి ఈత కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈతరాని కార్తీక్ చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సాయంత్రమైనా కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకెళ్లి చూడగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు తండ్రి బ్రహ్మచారి కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

గుమ్మడిదల గ్రామానికి చెందిన మల్లేశం(60) ఈనెల 24న బొంతపల్లి మల్లన్న జాతరకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బొంతపల్లి వద్ద జాతీయ రహదారి దాటుతుండగా.. కారు ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



మొండి కృష్ణ (ఫైల్)

హత్నూర, మార్చి 25: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ శివారులో చింతల్‌చెర్వు-గుండ్ల మాచునూర్ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన మొండి కృష్ణ(50) సోమవారం తన ద్విచక్ర వాహనంపై చింతలచెర్వుకు బయలుదేరాడు. ఆరుట్ల గ్రామ శివారులోని స్టోన్ క్రషర్లకు సమీపంలోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. కృష్ణ ద్విచక్ర వాహనంపై నుంచి ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. స్టోన్ క్రషర్ నుంచి అధిక లోడుతో అతివేగంగా వెళ్లే వాహనం ఢీకొట్టడంతోనే కృష్ణ మృతిచెందినట్లు గ్రామస్థులు ఆరోపించారు.

పట్టపగలే ఇంట్లోకి దూరేందుకు యత్నం

నర్సాపూర్, మార్చి 25: గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలే ఇంట్లోకి దూరేందుకు యత్నించాడు. నర్సాపూర్ పట్టణంలోని 14వ వార్డులో గుర్తు తెలియని వ్యక్తి సంచరిస్తూ ఓ ఇంట్లో దూరేందుకు యత్నించాడు. గమనించిన సమీపంలోని వారు పట్టుకుని నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దొంగతనానికి వచ్చి ఉంటాడని పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

ధర్మశాలలోని ఆలయంలో చోరీ

- పంచలోహ విగ్రహం, పూజా సామగ్రి అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

నర్సాపూర్, మార్చి 25: నర్సాపూర్ పట్టణం గాంధీ విగ్రహం సమీపంలోని ధర్మశాలలో ఉన్న అమ్మవారి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి రాధాకిషన్‌శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లగా.. చోరీ జరిగిన విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్‌ఐ పుష్పరాజ్, క్లూస్‌టీం వచ్చి వివరాలను సేకరించారు. ఆలయంలోని పంచలోహ విగ్రహంతో పాటు పూజా సామగ్రి చోరీకి గురైనట్లు పూజారి తెలిపారు.

ఏటీఎం చోరీకి యత్నించిన ఇద్దరికి రిమాండ్

చిన్నశంకరంపేట, మార్చి 25: చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఎస్బీఐ ఏటీఎం చోరీకి యత్నించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ సోమవారం తెలిపారు. గత శనివారం రాత్రి ఎస్బీఐ ఏటీఎం చోరీకి యత్నించి విఫలమైన సంఘటన విదితమే. ఏటీఎం పరిసర ప్రాంతాల సీసీ పుటేజీ ఆధారంగా గజగట్లపల్లి గ్రామానికి చెందిన పసుల ప్రవీణ్‌కుమార్, ముత్తిగారి మహేష్‌లుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఒక్కరోజులో కేసును ఛేదించిన పోలీసులను సీఐ వెంకటేష్ అభినందించారు.

హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు

తూప్రాన్, మార్చి 25: తూప్రాన్ డివిజన్‌కు చెందిన వృద్ధులకు హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. మైండ్‌ట్రీ కంపెనీ సహకారంతో తూప్రాన్ డివిజన్ పరిధిలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 140 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. హైదరాబాద్‌లోని పుష్పగిరి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు తరలించారు. విడతల వారీగా అందరికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నక్క మహేశ్ తెలిపారు.

జిల్లాలో కుష్ఠు అనుమానితులు 1815 మంది..

- కొత్త పాజిటివ్ కేసులు 15
- సంగారెడ్డి జిల్లాలో ముగిసిన ఎస్‌సీడీసీ సర్వే



సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మార్చి 25: సంగారెడ్డి జిల్లాలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) పేరిట వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వే ముగిసింది. ఈనెల 11 నుంచి 24వ తేదీవరకు ఆశావర్కర్లు ఇంటింటికెళ్లి సర్వే చేశారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలుంటే ఆశాలు సర్వే ద్వారా వివరాలు నమోదు చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 928 మంది ఆశాలు 3,17,257 ఇళ్లను సర్వే చేయగా, 1,815 మంది కుష్ఠు అనుమానితులు గుర్తించగా, 15 మందికి కొత్తగా కుష్ఠు బాధితులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆదిలోనే గుర్తిస్తే వ్యాధి నయం

కుష్ఠు ప్రధానంగా మైకో బ్యాక్టీరియం లెప్రె అనే బ్యాక్టీరియా వల్లా సంక్రమిస్తున్నది. కుష్ఠు ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతున్నది. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. వయసు, లింగ బేధం లేకుండా ఎవరికైనా ఈ వ్యాధి సోకవచ్చు. వంశపారంపర్యంగా ఈ వ్యాధి సంక్రమించదు. శరీరంలో ఏ భాగంలోనైనా సోకవచ్చు. కుష్ఠు ఎండీటీ మందులు 6 నుంచి 12 నెలలు వాడితే పూర్తిగా నయమవుతుంది. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స చేయించుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. వ్యాధిపై అవగాహన లేనివారు సరైన సమయంలో వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఇది తీవ్రరూపం దాల్చుతోంది. ఇలా ఉండగా జిల్లాలో కుష్ఠు నిర్మూలనకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశాంక్‌దేశ్‌పాండే తెలిపారు.



హవేలీఘణపూర్ చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారుడు(ఫైల్)

మత్స్యకారులకు ప్రమాదబీమా

- ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5 లక్షలు, శాశ్వత వైకల్యానికి రూ.2.50 లక్షలు
- మెదక్ జిల్లాలో 1,600 మంది మత్స్యకారులకు వర్తింపు

మెదక్, మార్చి 25: మత్స్యకారులకు ప్రమాదబీమా పథకం అమల్లోకి వచ్చింది. ప్రమాదానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య యోజన పథకం కింద బీమా సదుపాయం కల్పిస్తున్నది. ఈ పథకంలో చేరే వారు మృతిచెందితే రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2.5 లక్షలు పరిహారంగా అందజేస్తారు. మెదక్ జిల్లాలో 300 మత్స్య సహకార సంఘాలున్నాయి. ఇందులో 16 వేల మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇందులో 18 నుంచి 50 ఏళ్ల వయస్సున్న వారిని లబ్ధిదారులుగా చేర్చుకుంటారు. ఒక్కో మత్స్యకారుడికి రూ.70లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లిస్తున్నాయి. కేంద్రం వాటా రూ.40లు, రాష్ట్రం రూ.30లు చెలిస్తోంది. పాలసీదారుడు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5 లక్షలు, శాశ్వత వైకల్యం కలిగితే రూ.2.50 లక్షలు చెల్లిస్తారు. గాయపడితే రూ.25 వేలు ఆర్థిక సహాయం లభిస్తున్నది. కావున సొసైటీలో సభ్యత్వం పొందినవారు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు సూచిస్తున్నారు.

'ప్రావిడెంట్' సమస్యలపై ప్రత్యేక శిబిరాలు

- పీఎఫ్ కమిషనర్ విశాల్‌అగర్వాల్

పటాన్‌చెరు, మార్చి 25: ప్రావిడెంట్ ఫండ్ ఖాతాదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు పటాన్‌చెరు పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 27 నుంచి పలుచోట్ల ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని పటాన్‌చెరు పీఎఫ్ కార్యాలయం కమిషనర్ విశాల్‌అగర్వాల్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యనిధి(పీఎఫ్) ఖాతాదారుల సమస్యలను పరిష్కరించేందుకు 3 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యమని చెప్పారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో కంది అక్షయపాత్ర కార్యాలయం, సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో రెండు శిబిరాలతో పాటు రంగారెడ్డి పరిధిలోని ఖాతాదారుల కోసం శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ జయభేరి కార్యాలయంలో శిబిరాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఉదయం 9.30 నుంచి సాయత్రం 5.45 వరకు నిర్వహించే శిబిరానికి ఖాతాదారులు తమ అర్జీలతో హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నెగ్గేనా?

కొండపాక, మార్చి 25: కొండపాక ఎంపీపీ రాగల సుగుణపై ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై రాజకీయ చర్చ జోరుగా సాగుతున్నది. ఈ నెల 5న ఎంపీపీపై అవిశ్వాసం పెడుతూ 9 మంది ఎంపీటీసీలు ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం అందజేశారు. దానికి అనుగుణంగా అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 28న సమావేశం జరగనుంది. అవిశ్వాస తీర్మానం పెట్టిన ఎంపీటీసీ సభ్యులు తొమ్మిది మంది క్యాంపులో కొనసాగుతున్నారు. ఒకవేళ అవిశ్వాసం నెగ్గితే మళ్లీ బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులకే ఎంపీపీ పదవి వెళుతుందనే చర్చ సాగుతున్నది.

ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం



బీరప్ప కామరాతి కల్యాణ దృశ్యం

దూళిమిట్ట, మార్చి 25: మండలంలోని లింగాపూర్ గ్రామంలో సోమవారం కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరప్ప కామరాతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పెద్దపట్నం వేసి, బీర్ల పూజారుల ఆధ్వర్యంలో బీరప్ప కామరాతి కల్యాణాన్ని జరిపించారు. మహిళలు, కురుమ కులస్తులు అందరూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, ఒగ్గు డోలు వాయిద్యాలు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతవరణం నెలకొన్నది. కార్యక్రమంలో లింగాపూర్ గ్రామ కురుమ కులస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచని సీబీపీ అనలైజర్, ప్రింటర్





మద్దూరు పీహెచ్‌సీలో మొబైల్ నెట్‌వర్క్‌తో ఆన్‌లైన్ ఎంట్రీకి ప్రయత్నిస్తున్న టెక్నీషియన్, మద్దూరు పీహెచ్‌సీలో పనిచేయని సీబీపీ అనలైజర్

మద్దూరు, మార్చి 25: పేదలు ప్రైవేటుగా రక్త పరీక్షలు చేయించుకుంటే ఖర్చులు భారమవుతున్నాయనే ఉద్దేశంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో, రక్త నమూనా పరీక్షలు అందుబాటులో తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వం డయాగ్నోస్టిక్ సెంటర్లును ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా సేవలు మాత్రం అందడం లేదు. మద్దూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాగ్నోస్టిక్ సెంటర్లును ఏర్పాటు చేశారు. ఔట్ సోర్సింగ్ ద్వారా వాటికి టెక్నీషియన్స్‌ను నియమించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్యతో పాటు మహిళా ఆరోగ్య దినోత్సవం రోజైన మంగళవారం ఆశాల సేవల మూలంగా గర్భవతులు, బాలింతల సంఖ్యతో ఓపీ బాగా పెరిగింది. అయితే డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఏర్పాటు చేసిన సాధారణ రక్తపరీక్షలు నిర్వహించే సీబీపీ అనలైజర్‌తో పాటు ప్రింటర్ పాడైనా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనికి తోడు ఎలాంటి నెట్‌వర్క్ సదుపాయాలు కల్పించకపోవడంతో మొబైల్ నెట్‌వర్క్‌తో టెక్నీషియన్స్ సేకరించిన రక్త నమూనాలను కంప్యూటర్‌లో పొందుపర్చేందుకు తీవ్రజాప్యం జరుగుతున్నట్లు తెలుస్తున్నది. వైద్యులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పాటు వంతుల వారిగా విధులు నిర్వహిస్తుండటంతో ఆస్పత్రిలో పారిశుద్యం కొరవడింది.

ఇళ్ల మధ్యలో స్క్రాప్ దుకాణాలు



పట్టణంలో ఓ స్ర్కాప్ దుకాణం వద్ద వాహనాల టైర్లు, వివిధరకాల డ్రమ్ములను కాలుస్తుండడంతో వెలువడుతున్న వాయు కాలుష్యం

జహీరాబాద్, మార్చి 25: జహీరాబాద్ పట్టణంలో స్ర్కాప్ దుకాణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నది. స్ర్కాప్ దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసిన వివిధరకాల టైర్లు, డ్రమ్ములు తదితరాలను వారివారి దుకాణాల వద్దే జనావాసాల మధ్యలో కాలుస్తుండడంతో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతు వాయుకాలుష్యం ఏర్పడుతున్నది. దీంతో తాము నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా దుకాణాలకు చుట్టుపక్కల ఉన్న కాలనీలకు చెందినవారు దూరంగా అటవీ ప్రాంతంలో కాల్చండని పదేపదే చెబుతున్నా.. దుకాణాల నిర్వాహకులు గొడవలు సృష్టిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా స్ర్కాప్ దుకాణాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవరిహరించడంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాలం చెల్లిన పెద్దపెద్ద వాహనాలను సైతం ఇళ్ల మధ్యలోనే ఉంచి స్ర్కాప్‌గా మారుస్తున్నారన్నారు. ఈ సమయంలో కూడా పెద్ద పెద్ద శబ్దాలతో పాటు వాయు కాలుష్యం ఏర్పడుతున్నదని చెప్పారు. జనావాసాల మధ్యలో కాకుండా పట్టణానికి దూరంలో స్ర్కాప్ దుకాణాలను ఏర్పాటు చేసుకునేలా అధికారులు చొరవచూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయం మారినా.. బోర్డు మారలే!

- తికమక పడుతున్న రైతులు, ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన నిమ్జ్‌బోర్డు

జహీరాబాద్, మార్చి 25: జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గతంలో నిమ్జ్ కార్యాలయం ఏర్పాటు చేసి కొన్నాళ్లపాటు ప్రజలకు ఇక్కడి నుంచే సేవలందించారు. ఏడాది క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న నిమ్జ్ కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయం వద్దకు మార్చారు. కార్యాలయం మారి ఏడాది కావస్తున్నా.. అధికారులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డును మార్చకపోవడంతో ప్రజలు, రైతులు ఇక్కడికి వస్తూనే ఉన్నారు. తీరా ఇక్కడికొచ్చాక నిమ్జ్ కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయం వద్దకు మార్చారని తెలుసుకుని తిరిగి అక్కడికి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు కనిపించే విధంగా బోర్డును ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


పటాన్‌చెరులో హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి


జిన్నారంలో హోలీ వేడుకల్లో యువకులు


రామచంద్రాపురం వేడుకల్లో కార్పొరేటర్, కార్యకర్తలు


హత్నూర: దౌల్తాబాద్‌లో హోలీ సంబురాల్లో యువకులు


వట్‌పల్లి హోలీ వేడుకల్లో యువకులు


కల్హేర్: క్రిష్ణాపూర్ హోలీ వేడుకల్లో యువకులు


సిర్గాపూర్‌లో రంగులు పులుముకున్న యువకులు


ఖేడ్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హోలీ

అంబరాన్నంటిన హోలీ సంబురాలు


మునిపల్లిలో హోలీ ఆడుతున్న యువకులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సోమవారం హోలీ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి కాముని దహనం నిర్వహించగా, మరునాడు ఉదయం నుంచే పిల్లలు, పెద్దలు తేడా లేకుండా పరస్పరం రంగులు పులుముకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. యువతీ యువకులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ స్నేహితులపై రంగులు చల్లుతూ కేరింతలు కొట్టారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు పార్టీలకు అతీతంగా ప్రజల్లో కలిసిపోయి హోలీ ఆడుతూ సరదాగా గడిపారు. గ్రామాల్లో ఉట్టి కొట్టడం, గుండ్లు ఎత్తే పోటీలను నిర్వహించారు.

పటాన్‌చెరు, మార్చి 25: పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు, మార్వాడీలు పెద్ద సంఖ్యలో ఉండటం వల్ల హోలీ వేడుకలను పెద్ద ఎత్తున జరుపుకున్నారు. పటాన్‌చెరు, బీరంగూడా, కిష్టారెడ్డిపేట, అమీన్‌పూర్, అశోక్‌నగర్, బండ్లగూడ, ఇస్నాపూర్, భానూర్, చిట్కుల్, రుద్రారం, పాషమైలారం తదితర ప్రాంతాలలో హోలీ వేడుకలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి నివాసానికి రాగా, ఎమ్మెల్యే వారితో హోలీ ఆడి, శుభాకాంక్షలు తెలిపారు.


కోహీర్: హోలీ వేడుకల్లో యువకులు, చిన్నారులు


చేగుంటలో హోలీ పండుగ వేడుకలు

● **రామచంద్రాపురం:** మండలంలోని జీహెచ్‌ఎంసీ 111,112 డివిజన్ల పరిధిలో, రామచంద్రారెడ్డినగర్, ఎల్‌ఐజీ, హెచ్‌ఐజీ తదితర కాలనీలతో పాటు తెల్లాపూర్ మున్సిపాలిటీలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు పుష్పానగేష్, సింధూ ఆదర్శరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితసోమిరెడ్డి ఇళ్లకు చేరుకుని రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డిని కార్యకర్తలు రంగులతో ముంచెత్తి శుభాకాంక్షలు తెలిపారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువకులు పరస్పరం రంగులు చల్లుకున్నారు. రంగులునింపిన కుండతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్నినిర్వహించి, విజేతలైన వారికి భజరంగ్‌దళ్ బాధ్యులు బహుమతులను అందజేశారు. మంగల్‌పేటతోపాటు పట్టణంలోనివివిధ కాలనీల్లో పిల్లలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. శివారు నందు తండాలోని కాళికా మాత ఆలయం ఆవరణలో హోలీ వేడుకలను నిర్వహించారు.ఆర్యవైశ్యసంఘం, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో గుండ్లు ఎత్తే పోటీలు నిర్వహించారు.

● **పలు మండలాల్లో..**

జిన్నారం మండలకేంద్రంతో పాటు గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారం. ఇతర గ్రామాల్లో ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే హత్నూర, వట్‌పల్లి, కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, మనూరు, మునిపల్లి, కోహీర్ మండలాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల మహిళలు, పిల్లలతో పాటు పెద్దలు డీజే పాటలతో రంగులు చల్లుకున్నారు. యువకులు రంగులు చల్లుకుని ఆనందోత్సవాల నడుమ నృత్యాలు, కోలాటాలు వేశారు. పలు గ్రామాల్లో మేళతాళాలతో భారీఎత్తున ఊరేగింపు నిర్వహించి రంగులు చల్లుకున్నారు.


రామాయంపేటలో మహిళల సందడి

మెదక్ జిల్లాలో...

మెదక్ అర్బన్, మార్చి 25: జిల్లా కేంద్రంలో ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు, రంగుల్లో మునిగితేలారు. రంగులు చల్లుకుంటూ, డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. వాసవీ క్లబ్, సన్‌రైజ్ వాకర్స్, ఉపాధ్యాయ సంఘాలు, పీఈటీల సంఘాల ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా హోలీ సంబురాలు నిర్వహించారు. పట్టణంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలవారు కలిసిపోయి హోలీ వేడుకలు జరుపుకున్నారు. పాటలపై నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకున్నారు.

● **తూప్రాన్:** తూప్రాన్‌లో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ఆచారం ప్రకారం హోలీ పండుగ రోజున పిల్లల పిడి, పెద్దల పిడితాడు లాగారు. ఉదయం వినాయక నగర్‌లో మాజీ సర్పంచు రామునిగారి వీర్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పిల్లల పిడితాడును లాగారు. సాయంత్రం జెండా వద్ద పెద్దల పిడి తాడును లాగారు. సంప్రదాయం ప్రకారం దొంతి సంస్థానం, రామారం సంస్థానం మధ్య పిడితాడును లాగారు. ఆనవాయితీ ప్రకారం రామారం సంస్థానానికి తాడును వదలిని గెలుపును ఇచ్చారు. పిడితాడు లాగిన సందర్భంగా జెండా వద్ద జాతర నిర్వహించారు.


తూప్రాన్‌లో పిడి తాడు లాగుతున్న గ్రామస్థులు

● **మండలాల్లో..**

మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హవేళిఘణపూర్, అల్లాదుర్గం, చిన్నశంకరంపేట, చిలప్‌చెడ్, శివ్వంపేట, కొల్చారం, మనోహరాబాద్, మాసాయిపేట, చేగుంట, నార్సింగ్, రామాయంపేట, పాపన్నపేట, రేగోడు తదితర మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. సోమవారం ఉదయం ప్రజలు చిన్నా పెద్దా రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. చిన్నశంకరంపేట మండలం పరిశ్రమల కూడలిలో మార్వాడి యువత బ్యాండ్ మేళాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ హస్టళ్లలోనూ విద్యార్థులు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల యువకులు మోటార్ సైకిళ్లపై తిరుగుతూ స్నేహితులకు రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


రేగోడులో హోలీ ఆడుతున్న మహిళలు


హవేళిఘణపూర్‌లో హోలీ వేడుకలు


అల్లాదుర్గం: హోలీ సంబురాల్లో యువకులు


పెద్దశంకరంపేటలో..


శివ్వంపేటలో డప్పు చప్పుళ్ల మధ్య హోలీ వేడుకలు


కొల్చారంలో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు


మనోహరాబాద్‌లో చిన్నారులతో యువకులు


చేగుంట: నార్సింగ్‌లో హోలీ వేడుకలు


పాపన్నపేటలో హోలీ సంబురాలు

మేడపై నుంచి పడిన వ్యక్తి మృతి

దుబ్బాక, మార్చి 25: పట్టణంలో చెత్తను కిందికి పారబోస్తూ, ప్రమాదవశాత్తు కాలుజారి మేడ పైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ వార్డుకు చెందిన పోతరాజు లింగం(37) తన భార్య వేదశ్రీతో కలిసి ఓ భవనంలోని మొదటి అంతస్తులో పదిహేను రోజుల క్రితమే అద్దెకు దిగాడు. ఆదివారం రాత్రి మేడపై నుంచి కిందకు చెత్తపోరబోస్తున్న లింగం కాలుజారి కిందపడిపోయాడు. వెంటనే అతడిని దుబ్బాక ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బెజ్జంకి, మార్చి 25: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తోటపల్లి రాజీవ్ రహదారి పై ఈ నెల 22న ఆగి ఉన్న లారీని హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి చెందిన రాజకుమారి (42), రవీందర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజకుమారి సోమవారం మృతి చెందింది.

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు


వంటిమామిడి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ములుగు, మార్చి 25: పార్లమెంట్ ఎన్నికల సమయంలో వంటిమామిడి చెక్‌పోస్ట్ వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదేశించారు. సోమవారం ములుగు మండలం వంటిమామిడి చెక్‌పోస్టు వద్ద ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం జిల్లాలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, తనిఖీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఏసీపీ వెంట ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే

పాపన్నపేట, మార్చి 25: మండల పరిధిలోని కొత్తపల్లిలో జరుగుతున్న అనంత పద్మనాభ స్వామి జాతరలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను వేదపండితులు ఆలయ మర్యాద ప్రకారం స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తమ్మయపల్లిలో నిర్వహిస్తున్న మల్లన్న కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి డాక్యతండాకు చేరుకొని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ ఎంపీటీసీ మౌనిక రాజును పరామర్శించారు. పొడిచాన్పల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల సంతోష్‌రెడ్డి తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి పరామర్శించారు. కాగా పాపన్నపేట మండలంలో ఆదివారం మిషన్ భగీరథ నీళ్ల సరఫరా కాలేదన్న విషయాన్ని ఎమ్మెల్యే రోహిత్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే మిషన్ భగీరథ నీళ్ల రావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటి నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోవింద నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ పాపన్నపేట ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.


పూజలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

నారాయణఖేడ్, మార్చి 25: వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణ కోసం ముందస్తు చర్యలను చేపట్టారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటలోని రెండో వార్డులో చెడి పోయిన బోరు బావులను గుర్తించి మరమ్మతులు చేయిస్తూ, వాటి ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మంగల్‌పేటలో బోరుబావి మరమ్మతులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా నీరు అందే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట వాటర్ సప్లయ్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.


మంగల్‌పేటలో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్

సమస్యలపై నిరంతర పోరాటం

గజ్వేల్, మార్చి 25: విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతర పోరాటం చేస్తున్నదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన 15వ ఎస్‌ఎఫ్‌ఐ గజ్వేల్ డివిజన్ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 13మందితో కూడిన గజ్వేల్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా నాచారం శేఖర్, ఉపాధ్యక్షుడిగా నరేశ్, వేముల ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా ప్రణయ్, శివకుమార్, కమిటీ సభ్యులుగా భరత్, సందీప్, ప్రవీణ్, సిద్దార్థ్, మహేశ్, సంపత్, ప్రవీణ్ తదితరులు ఎన్నికయ్యారు.

వాహన తనిఖీల్లో గంజాయి లభ్యం

● **ముగ్గురు నిందితుల అరెస్టు... 16 సెల్‌ఫోన్లు స్వాధీనం**



పోలీసుల అదుపులో నిందితులు

సంగారెడ్డి క్రైం, మార్చి 25: పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో సంగారెడ్డి రూరల్ పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి రూరల్ పోలీసులు సోమవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఒకపల్సర్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం నిందితులను విచారించగా 300 గ్రాముల గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని మల్లికార్జున కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వడ్డే సునీల్(20), కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా బ్రాహ్మనగర్‌కు చెందిన చింటూ అంబాజీ (24), ఒరిస్సా రాష్ట్రం భద్ర జిల్లా బోయికుంటకు చెందిన రజనీకాంత్ నాయక్(43) జల్సాలకు అలవాటుపడి బైక్ దొంగతనాలకు పాల్పడేవారు. అంతేగాక సెల్‌ఫోన్‌లు దొంగతనం చేస్తూ గంజాయి అక్రమ రవాణా చేసే వారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 300 గ్రాముల గంజాయి, 16 సెల్‌ఫోన్‌లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 6వేల వరకు ఉంటుందని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి


శిబిరం ముగింపు కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుతో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, సీఐ రవి

మనోహరాబాద్, మార్చి 25: జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ 36వ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలికల జట్టు రాణించాలని తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో గత వారం రోజులుగా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు క్యాంపు నిర్వహించారు. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ ఫస్ట్ వరకు సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలు మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ సంబాగ్ ఔరంగాబాద్‌లో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మనోహరాబాద్‌లో జరిగిన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులు తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, ఇంటెలిజెన్స్ సీఐ రవికుమార్ హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి పోటీల్లో జిల్లా జట్టు బంగారు పతకం సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్‌గౌడ్, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, శిక్షకుడు రవి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు


మెదక్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మెదక్ అర్బన్, మార్చి 25: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధి అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రధాన అర్చకులు రాజు పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, పడిపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో అయ్యప్ప సేవ సమాజం బృందం, భక్తులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..


తూప్రాన్ అయ్యప్ప ఆలయంలో పూజలు

తూప్రాన్, మార్చి 25: తూప్రాన్ పట్టణంలోని శ్రీఅయ్యప్ప ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ఆలయంలో మహాపడి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అంతర్గాంలో ఘనంగా బీరప్ప జాతర

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 25: సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గ్రామంలో బీరప్ప ఆలయ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదట బీరప్ప, కామరతిల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం పోతరాజులు గావు పట్టారు. ఉత్సవాల్లో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి, సిర్గాపూర్ జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, కురుమ సంఘం తాలూకా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్గొండ పాల్గొని బీరప్ప ఆలయంలో పూజలు నిర్వహించారు.

నవాబుపేట పాజిల్‌నగర్ గుట్టపై ఉర్సు ప్రారంభం

శివ్వంపేట, మార్చి 25: మండలంలోని నవాబుపేట గ్రామంలో పాజిల్‌నగర్ గుట్టపై మూడురోజుల పాటు నిర్వహించే ఉర్సు సోమవారం నిర్వాహకులు లతీఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో జెండా గంధం ఊరేగింపును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

నిరుపయోగంగా రైతు వేదికలు


మనోహరాబాద్‌లో నిరుపయోగంగా రైతు వేదిక

మనోహరాబాద్, మార్చి 25: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రైతుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలు వెచ్చించి రైతు వేదికలను నిర్మించిన సంగతి తెలిసిందే. అయితే వాటి లక్ష్యం నెరవేరక ప్రస్తుతం నిరుపయోగంగానే ఉన్నాయి. మనోహరాబాద్ మండల కేంద్రంలో కూచారం, మనోహరాబాద్ మండల కేంద్రంలో రెండు రైతు వేదికలు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం ప్రభుత్వ కార్యక్రమాలు, మీటింగ్‌లు ఉన్నప్పుడే మాత్రమే వాటిని ఉపయోగించేవారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు నిరుపయోగంగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పట్టిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ విషయాన్ని గ్రహించి రైతు వేదికలు ఉపయోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్ లేక అవస్థలు

హవేళిఘణపూర్, మార్చి 25: హవేళిఘణపూర్‌లో ఆధార్ సెంటర్ లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన ఆధార్‌కార్డు తీసుకోవాలన్నా, అప్‌డేట్, సవరణలు చేసుకోవాలన్నా మెదక్‌కు వెళ్లాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో కూడా ఎక్కువ మంది బారులు తీరడంతో చాలా రోజులు తిరగాల్సివస్తుందని దీంతో వ్యయ ప్రయాసలు తప్పడం లేదని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, నాయకులు చొరవ తీసుకుని హవేళిఘణపూర్‌లో కొత్త ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.